సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



అఘాయిత్యాలపై కఠిన చర్యలు
చిన్నారులు, బాలికలు, మహిళలపై లైంగిక దాడులు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీజీపీ ద్వారకాతిరుమల రావు హెచ్చరించారు. 8లో ▸



హుండీ ఆదాయం రూ.2.05 కోట్లు
ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 28 రోజులకు రూ.2,05,16,675 నగదు లభించిందని ఈఓ తెలిపారు. 8లో ▸



ఆశ్రమం మాటున మానవ మృగాలు
ఏలూరులో సరస్వతి సేవాశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న బాలికల వసతి గృహంలో అఘాయిత్యాల కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. 8లో ▸

● ఎన్డీయే ప్రభుత్వం రాగానే..

రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మరింత సంక్షేమాన్ని అందిస్తాం. తెదేపా, ఎన్డీయే ప్రభుత్వం 2014-19లో 19 శాతం సంపదను సంక్షేమ పథకాలకు ఖర్చు చేసింది. అన్ని పథకాలు అమలు చేస్తాం..



నరసాపురం, పాలకొల్లులో ప్రజాగళం రోడ్‌షో, బహిరంగ సభల్లో చంద్రబాబు చేసిన ప్రసంగం

● ప్రతి బిడ్డకూ రూ. 15 వేలు

ఆడబిడ్డ నిధి కింద ప్రతి ఆడపిల్లకు నెలకు రూ. 1,500, తల్లికి వందనం కింద ప్రతి బిడ్డకు రూ.15 వేలు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. అన్నదాతకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం అర్హులందరికీ అందిస్తాం.



తణుకులో జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు ఇచ్చిన హామీ

● ప్రజా సంక్షేమానికే సూపర్ సిక్స్

సూపర్‌సిక్స్‌లో భాగంగా 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ. 1,500, నిరుద్యోగులకు భృతి కింద నెలకు రూ.3 వేలు, విద్యార్థులకు రూ. 15 వేలు, రైతులకు రూ. 20 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తాం.



పోడూరు, పెనుమంట్ర మండలాల సమావేశంలో ప్రస్తుత ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దిశానిర్దేశం

● మహిళలకు హామీల వర్షం

మహిళలకు స్వయం ఉపాధి కల్పించింది టీడీపీ. డ్వాక్రా సంఘాలను ఏర్పాటుచేశాం. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 ఇస్తాం. ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తాం. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఏటా చెల్లిస్తాం.



నరసాపురం, పాలకొల్లులో జరిగిన ప్రజాగళం సభల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు



ఆడబిడ్డకు రూ.1,500

18 ఏళ్లు నిండిన అక్కచెల్లెమ్మలందరికీ నెలకు రూ.1,500 ఆర్థిక సాయం చేస్తాం. నేరుగా వారి అకౌంట్‌లోనే జమ చేస్తాం.

- ఆచంట ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

1



కూటమి అధికారంలోకి రాగానే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం.

- నరసాపురం ప్రచారంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

2



రైతుకు ఏటా రూ.20 వేలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల సాయం అందిస్తాం.

- తాడేపల్లిగూడెం ప్రచారంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

3



రూ.3 వేల నిరుద్యోగ భృతి

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారు. అప్పటివరకు నిరుద్యోగులకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తారు.

- తణుకు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

4




అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికీ..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికీ ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం.

- భీమవరం ప్రచారంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు

5



పిల్లలందరికీ తల్లికి వందనం

తల్లికి వందనం కింద ఏడాదికి ప్రతి బిడ్డకీ రూ.15,000 ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. ఇద్దరుంటే ఇద్దరికీ.. ముగ్గురుంటే ముగ్గురికీ.. నలుగురుంటే నలుగురికీ అందిస్తాం.

- జిల్లాలో ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు

6


6 సూపర్ ఫ్లాప్



- బాబు షూరిటీ.. ఒక్క దానికీ లేదు గ్యారెంటీ
- వంద రోజులు గడుస్తున్నా స్పష్టత కరువు
- ఒక్క పథకాన్నీ అమలు చేయని వైనం
- ఆరునూరైనా అమలు చేయాలంటున్న ప్రజలు

అబద్ధపు హామీలతో అందలమెక్కి..

అధికారం చేపట్టిన తర్వాత పట్టించుకోకపోవడం.. విశ్వసనీయత లేని నాయకుడనే ఆక్షేపణ.. అధికారమే పరమావధిగా ప్రజలను మభ్యపెట్టడం చంద్రబాబు నైజం.. 'మారిన మనిషంటూ' జనాల్ని నమ్మించి.. సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టి.. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన చంద్రబాబు.. ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటే భయమేస్తోందని అనడం ఆయన అవకాశవాద రాజకీయాలకు నిదర్శనం. అధికారంలోకి వచ్చీ రాగానే ఏటా రైతు సాయం పేరుతో రూ.20 వేలు, ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున తల్లికి వందనం, 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 సాయం, మహిళలకు రాష్ట్రంలో ఎక్కడ తిరిగినా ఉచిత బస్సు ప్రయాణం ఇలా సూపర్ సిక్స్ పథకాలంటూ ఊరూవాడా గట్టిగా ప్రచారం చేశారు. గద్దెనెక్కి 100 రోజులు గడుస్తున్నా వీటి ఊసెత్తకపోవడం గమనార్హం. ఎన్నికల ప్రచారంలో మారిన మనిషినంటూ ప్రతి చోటా చెప్పుకున్న ఆయన ముసుగు తొలగించుకుని నేనేమీ మారలేదంటూ.. తన కుట్రపూరిత నైజాన్ని మరోసారి బయటపెట్టారు.




సాక్షి, భీమవరం : కూటమికి విజయాన్ని అందించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో అమలుకు చంద్రబాబు సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. జూన్ నెల నుంచే అమల్లోకి తెస్తామంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టి ఇప్పుడు వెనుకడుగేస్తోంది. ఆయా పథకాల అమలుకు సంబంధించి ఇప్పటికీ విధివిధానాలు రూపొందించకపోవడం, ప్రస్తుత పరిస్థితుల్లో సూపర్ సిక్స్ అంటే భయమేస్తోందంటూ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు హామీల అమలుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. జిల్లాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 5న నరసాపురం, పాలకొల్లు, ఏప్రిల్ 10న తణుకు, ఏప్రిల్ 21న నరసాపురం, భీమవరం, ఏప్రిల్ 29న తాడేపల్లిగూడెం, మేన 10న ఉండి బహిరంగ సభల్లో పాల్గొన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సూపర్ సిక్స్‌పై పలు హామీలిచ్చారు.

సంతకాలు చేసిచ్చి.. పూర్తిగా విస్మరించి..

అధికారంలోకి రావడమే తరువాయి.. జూన్ నెల నుంచే సూపర్ సిక్స్ పథకాలు అమల్లోకి వచ్చేస్తాయంటూ ఎన్నికల ముందు కూటమి అభ్యర్థులు ఊదరగొట్టారు. 'బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ' అంటూ ఒక ఇంట్లో కుటుంబ సభ్యులకు సూపర్ సిక్స్‌లోని వర్తించే పథకాలు, వాటి ద్వారా వారికి చేకూరే లబ్ధిని పేర్కొంటూ టీడీపీ బూత్ కమిటీ అధ్యక్షుడు సంతకం చేసి మరీ ఇంటింటికీ పేపర్లు అందజేశారు. వాటినే బాండ్ పేపర్లుగా భావించాలని ఓటర్లను కోరారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తోంది. నెలనెలా అకౌంట్‌కు వేస్తామని చెప్పిన రూ.1,500, ఎందరు పిల్లలుంటే అందరికీ రూ.15,000, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు సౌకర్యం కోసం అక్కచెల్లెమ్మలు ఎదురుచూస్తుంటే.. సాగుకు ఊతమిచ్చేలా రూ.20 వేలు సాయం ప్రకటన కోసం అన్నదాతలు.. ఉద్యోగాలు ఇచ్చేంత వరకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి కోసం యువత నిరీక్షిస్తున్నారు.

నిరుద్యోగ భృతి



జిల్లాలో కుటుంబాలు 5.17 లక్షలు

రూ. 3,000 ఆర్థిక సాయం కోసం వీరంతా ఎదురుచూపు



భృతి ఎప్పుడండీ..

అధికారం చేపట్టిన తర్వాత హామీలను విస్మరించడం తగదు. ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల వాగ్దానం చేసి ఓట్లు వేయించుకున్నారు. ఈ హామీ గురించి కనీసం ఊసెత్తడం లేదు.

- బడుగు బాలాజీ, నిరుద్యోగి, ఉండి

తల్లికి వందనం..



జిల్లాలో విద్యార్థులు 2,49,662

అర్హులైన విద్యార్థులు సుమారు 1,74,763

ఏడాదికి రూ.15 వేల చొప్పున అందించాల్సిన సాయం రూ.262.14 కోట్లు



ఎంత మంది పిల్లలున్నా..

తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలున్నా ఏడాదికి రూ.15,000 చొప్పున ఇస్తామని మహిళలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలిచారు. హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రజలంతా కోరుతున్నారు. సూపర్‌సిక్స్‌ను అమలు చేయాల్సిందే.

- ఉండవల్లి జానకి, మాజీ ఏఎంసీ చైర్మన్, తణుకు



తల్లికి వందనం ఏదీ?

ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు తల్లికి వందనం పథకంలో కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఈ పథకంపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఎప్పటిలానే ఎన్నికల హామీలను తుంగలో తొక్కుతున్నారు.

- తాడిపర్తి రజని, తాడేపల్లిగూడెం

ఉచిత ప్రయాణం ఎప్పటినుంచో..

జిల్లాలో తెల్లకార్డులు 5,35,707, అంత్యోదయ కార్డులు 31,944 మొత్తంగా 5,67,651 రేషన్ కార్డులు ఉన్నాయి. ఒక్కో కార్డుపై ఏడాదికి మూడు చొప్పున ఇవ్వాల్సిన గ్యాస్ సిలిండర్లు 17,02,953. అలాగే జిల్లా జనాభా 19,00,228 కాగా మహిళా జనాభా 9,51,766 ఉన్నారు. జిల్లాలో భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెంలో ఆర్టీసీ డిపోలు ఉండగా ఆయా సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందించాల్సి ఉంది. ఉచిత ప్రయాణం ఎప్పటి నుంచి అమలు చేస్తారనే విషయంలో స్పష్టత లేకపోవడం జిల్లా మహిళలను నిరాశకు గురిచేస్తోంది.

మహిళలకు ప్రతి నెలా రూ.1,500



మహిళలకు ప్రతి నెలా రూ.1,500

జిల్లాలో 18 ఏళ్లు నిండిన మహిళలు 7,51,313

రూ.1,500 పొందేందుకు అర్హులు 5,96,313

నెలకు అందించాల్సిన సాయం రూ.89.45 కోట్లు

మూడు నెలల్లో నష్టపోయిన మొత్తం రూ.268.35 కోట్లు



ఆడబిడ్డ నిధి అందేనా?


కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతినెలా మహిళలకు రూ.1,500 చొప్పున సాయం చేస్తామన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఊదరగొట్టారు. ఇప్పుడు సూపర్ సిక్స్ అంటే భయమేస్తుందని చంద్రబాబు అనడం సమంజసం కాదు.

- రూనీస్ లారెన్స్, తణుకు

సూపర్ సిక్స్

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం ॥ వరకు)
- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

అన్నదాత సుఖీభవ



జిల్లాలో సాగుభూమి 2.3 లక్షల ఎకరాలు

రైతులు 1,24,645

ఏడాదికి రూ.20 వేల చొప్పున అందించాల్సిన సాయం రూ.249.29 కోట్లు



అన్నదాతకు సాయమేదీ

అబద్ధాల చంద్రబాబును మళ్లీ ప్రజలు నమ్మారు. ఆయన రాజకీయమంతా మోసంతో నిండిందే. వాగ్దానాలు, మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ గాలికి వదలివేశారు. సూపర్‌సిక్స్‌లో ఏ ఒక్కటీ అమలుకు సుముఖంగా లేరు. రైతులకు పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారో.

- అంబటి రమేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, ఆకివీడు



నాడు తలుపు తట్టిన సంక్షేమం.. సాధికారత

గత ఐదేళ్ల వైఎస్ జగన్ ప్రభుత్వ పాలనలో సంక్షేమం పేదింటి తలుపు తట్టింది. కులమత వర్గాలు, రాజకీయాలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికి సంక్షేమ లబ్ధిని చేకూర్చారు. సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి పథకాలను అమలుచేశారు. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం తదితర సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో జిల్లాలోని పేదవర్గాలకు 2023-24లో రూ.1,362.07 లబ్ధిని చేకూర్చారు.



2023 ఏప్రిల్

- జగనన్న వసతి దీవెన 28,683 మంది తల్లుల ఖాతాల్లో రూ.31.69 కోట్లు
- వైఎస్సార్ ఈబీసీ నేస్తం 13,460 మందికి 20.19 కోట్లు

మొత్తం లబ్ధి రూ.51.88 కోట్లు

2023 మే

- వైఎస్సార్ రైతు భరోసా 1,46,324 మంది రైతులకు రూ.109.74 కోట్లు
- వైఎస్సార్ ఉచిత పంటల బీమా 11,373 మంది రైతులకు 11.01 కోట్లు
- జగనన్న విద్యాదీవెన 26,685 మంది విద్యార్థులకు రూ.20.8 కోట్లు
- వైఎస్సార్ కల్యాణమస్తు/షాదీతోఫా 383 మందికి రూ.2.74 కోట్లు
- వైఎస్సార్ మత్స్యకార భరోసా 1635 మందికి రూ.1.63 కోట్లు

మొత్తం లబ్ధి రూ.145.92 కోట్లు

2023 జూన్

- జగనన్న విద్యాకానుక 1,14,024 మంది విద్యార్థులకు లబ్ధి
- జగనన్న అమ్మఒడి 1,43,534 మంది తల్లులకు రూ. 215.30 కోట్లు
- వైఎస్సార్ లా నేస్తం 68 మందికి రూ. 13.50 లక్షలు

మొత్తం లబ్ధి రూ. 215.43 కోట్లు

2023 జూలై

- జగనన్న విదేశీ విద్యాదీవెన 8 మందికి రూ.60.76 లక్షలు
- వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం 1,027 మందికి రూ.2,46,48,000
- జగనన్న తోడు 22,604, మందికి రూ.50.47 లక్షలు
- వైఎస్‌ఆర్ సున్నావడ్డీ 37,187 సంఘాలకు రూ.53.71 కోట్లు
- వైఎస్సార్ కల్యాణమస్తు/షాదీతోఫా 1,476 మందికి రూ.10.07 కోట్లు

మొత్తం లబ్ధి రూ.67.35 కోట్లు

2023 ఆగస్టు

- వైఎస్సార్ కాపునేస్తం 34,642 మందికి రూ.51.96 కోట్లు
- వైఎస్సార్ వాహనమిత్ర 8,568 మందికి రూ.8.57 కోట్లు

మొత్తం రూ.60.53 కోట్లు

ఆశ్రమం మాటున మానవ మృగాలు

- ఏలూరు బాలికల అత్యాచార కేసులో మలుపు
- ఆశ్రమం స్వామిజీ వ్యవహారంపైనా సందేహాలు
- ఆ స్వామికి టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలు
- పోలీస్ విచారణలో వార్డెన్ ఫణిశ్రీ, శశికుమార్
- నిందితులను కఠినంగా శిక్షించాలి : కారుమూరి సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేటలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న బాలికల వసతి గృహంలో అఘాయిత్యాల కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఈ కేసులో విస్తుగొలిపే అనేక విషయాలు బయటపడుతున్నాయి. బాలికల భవిష్యత్తును చిదిమేసిన నిందితుడు శశికుమార్‌తోపాటు సేవాశ్రమం స్వామిజీ పైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక స్వామీజీకి టీడీపీలోని మంత్రులు, నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అనేక దారుణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని బాధితుల బంధువులు చెబుతున్నారు.


ఏలూరు అమీనాపేటలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం బాలికల వసతిగృహం

ఆశ్రమం స్వామీజీపైనా అనుమానాలు?

కేసులో ప్రధాన నిందితుడు శశికుమార్‌ను ఏలూరు పోలీసులు విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలికలు, వారి తల్లిదండ్రులు చెబుతున్న విషయాల ఆధారంగా విచారణలో వేగం పెంచారు. హాస్టల్ నుంచి బాపట్లలో స్వామీజీ వద్దకు పలువురు బాలికలను తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం ఒక బాలికను తీసుకువెళ్లిన శశికుమార్ స్వామీజీకి చూపించాడని, బాలికను చూసిన స్వామీజీ బాగుందని, ఉపయోగపడుతుందని చెప్పినట్లు బాలిక తన స్నేహితుల వద్ద వాపోయింది. తనకు ఏమీ అర్థం కాలేదని, రూమ్‌కు తీసుకువెళ్లి అక్కడ తాళ్ళతో కట్టేసి బలత్కారం చేసినట్లు కొందరు బాలికలు అంటున్నారు. ఇదే తరహాలో చాలా మంది బాలికలను స్వామీజీ వద్దకు ప్రధాన నిందితుడు శశికుమార్ తీసుకెళ్లేవాడని చెబుతున్నారు.


టీడీపీ నేతలతో స్వామి దయానంద సరస్వతి (ఫైల్)

పోలీసుల విచారణలో నిందితులు

ఏలూరు అమీనాపేట ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్ విద్యార్థినుల జీవితాలతో ఆడుకున్న మృగం బీ.శశికుమార్, వార్డెన్ ఫణిశ్రీ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ పర్యవేక్షణలో డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలు విచారణ చేస్తున్నట్లు చెబుతున్నారు. బుధవారం తెల్లవారుజామున ఇద్దరు ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇక కేర్‌టేకర్‌గా హాస్టల్‌లో ఉంటున్న లావణ్యను సైతం పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ముగ్గురు బాలికలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్వామీజీకి టీడీపీ నేతలతో సంబంధాలు

ఏలూరు అమీనాపేటలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం నిర్వాహకుడు స్వామీజీకి టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఏలేశ్వరంలో శ్రీ దయానంద సర్వస్వతీ సేవాశ్రమం ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి హాజరైనట్లు తెలుస్తోంది. దయానంద సరస్వతి స్వామి టీడీపీ నేతలతో సన్నిహితంగా ఉంటారని అంటున్నారు. నిందితుడు శశికుమార్ దయానంద సర్వస్వతి స్వామి వద్దకు బాలికలను తరచు తీసుకెళ్తూ ఉంటాడని బాధిత బాలికలే చెప్పడం గమనార్హం.


ఏలేశ్వరంలో స్వామి దయానంద సరస్వతి ఆశ్రమం ప్రారంభోత్సవంలో టీడీపీ మంత్రి, నేతలు(ఫైల్)

హాస్టల్ నుంచి వెళ్లిపోయిన బాలికలు

హాస్టల్‌లో వసతి పొందుతున్న బాలికలు భయంతో వణికిపోయారు. హాస్టల్ నుంచి బాలికలు తమ గ్రామాలకు వెళ్లిపోయారు. నిందితుడు శశికుమార్ అనాథ బాలికలనే టార్గెట్ చేసుకునేవాడని సమాచారం. తల్లిదండ్రులు లేని బాలికలను లక్ష్యంగా చేసుకుని వారికి భయపెట్టి అఘాయిత్యాలకు పాల్పడుతుంటాడని చెబుతున్నారు. ఏలూరుతో పాటు ఇతర ప్రాంతాలకు సైతం బాలికలను తీసుకెళ్లేవాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కఠినంగా శిక్షించాలి



అమీనాపేట ఆశ్రమం బాలికల హాస్టల్‌లో జరిగిన అత్యంత హేయమైన సంఘటనపై పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేసి నిందితుడు శశికుమార్, సహకరించిన వార్డెన్ ఫణిశ్రీని కఠినంగా శిక్షించాలి. బాలికలకు రక్షణ కల్పించలేకపోవడం సిగ్గుచేటు. ఇలాంటి వ్యక్తిత్వం ఉన్న వారిని బాహ్య ప్రపంచంలో తిరిగనివ్వకూడదు.

కారుమూరి సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్

బాధితులకు అండగా ఉండాలి



పేదవర్గాలకు చెందిన బాలికలు చదువుకునేందుకు వస్తే నీచమైన రీతిలో మానవమృగంలా మారిన శశికుమార్ వారి జీవితాలను నాశనం చేయటం దారుణం. అతనికి సహకరించిన వ్యక్తులను వదిలిపెట్టకుండా కఠినంగా శిక్షించేలా పోలీసు అధికారులు కేసులు పెట్టాలి. బాధితులకు న్యాయం చేయాలి.

వైఎన్‌వీ శివరావు, జేసీఎస్ కన్వీనర్, ఏలూరు

క్లుప్తంగా

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.05 కోట్లు


హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ జరిగింది. ఈ లెక్కింపులో శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. గత 28 రోజులకు నగదు రూపేణా స్వామి వారికి రూ.2,05,16,675 ఆదాయంతో పాటు, కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 197 గ్రాముల బంగారం, 4.406 కేజీల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. లెక్కింపులోకి రాని పాత రూ.2000, రూ.1,000, రూ.500 నోట్లు ద్వారా రూ.13,500 లభించినట్టు చెప్పారు.

21న ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు

వీరవాసరం : జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2024–25 విద్యా సంవత్సరానికి అండర్–14, అండర్–17 బాల బాలికలకు ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీఎస్‌ఎన్ మల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్ల ఎంపికలు 21న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లంట్ల, దేవరపల్లి మండలంలో ఉదయం 8.30 గంటల నుంచి జరగనున్నాయని చెప్పారు. వివరాలకు రామకృష్ణ నెంబర్ 9441688434ను సంప్రదించాలని కోరారు.

జిల్లాలో విద్యుత్ అధికారుల బదిలీ

ఏలూరు(ఆర్ఆర్‌పేట) : ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన అధికారులను బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలోని నిడదవోలులో పని చేస్తున్న బీ.గీతా భవాని, తాడువాయి ఏఈఈగా పని చేస్తున్న ఎస్.శ్రీనివాసులును రాజమహేంద్రవరం సర్కిల్‌కు బదిలీ చేశారు. గణపవరం ఏఈఈగా పనిచేస్తున్న కేఎస్ఎస్ ప్రసాద్, ఉండ్రాజవరం ఏఈఈగా పనిచేస్తున్న ఎస్.దొరబాబును కూడా రాజమహేంద్రవరం సర్కిల్‌కు బదిలీ చేశారు. రాజమండ్రి సర్కిల్ పరిధిలోని ముమ్మిడివరం ఏఈగా పని చేస్తున్న వీ.శివాజీని, ఐ.పోలవరం ఏఈగా పని చేస్తున్న జీ.సోమేశ్వరరావును ఏలూరు సర్కిల్‌కు బదిలీ చేశారు.

బీచ్‌లో యువకుడు గల్లంతు


గల్లంతైన యువకుడు గంధం ప్రవీణ్‌కుమార్

నరసాపురం రూరల్: స్నేహితులతో కలిసి విహార యాత్రకు వెళ్లిన భీమవరం పట్టణానికి చెందిన ఒక యువకుడు మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం బుధవారం భీమవరం పట్టణం మెంటేవారితోటకు చెందిన ఒక యువకుడు పుట్టిన రోజును పురస్కరించుకుని ఏడుగురు యువకులు పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. తీరంలో సరదాగా ఆడుకుంటూ ఉండగా భారీ అలలు రావడంతో గంధం ప్రవీణ్‌కుమార్ (17) గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు.

అవసరం తీరాక.. జంప్

- వైఎస్సార్‌సీపీకి జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ వెన్నుపోటు
- సర్పంచ్‌గా ఓడిన కుటుంబం నుంచి జెడ్పీటీసీగా అవకాశం
- గతేడాది జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవ ఎన్నిక
- ఇప్పుడు అధికారం కోసం అడ్డదారులు


టీడీపీలో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆమె భర్త ఘంటా ప్రసాద్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి వైఎస్సార్‌సీపీలో ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. సాధారణ గృహిణిగా ఉన్న ఆమెకు జెడ్పీటీసీగా అవకాశం కల్పించారు. కొంత కాలానికి జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. 2014 స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా ఓడిపోయిన కుటుంబం నుంచి వచ్చిన మహిళకు జెడ్పీటీసీగా, జెడ్పీ చైర్మన్‌గా అనేక అవకాశాలు ఇచ్చి అందలం ఎక్కిస్తే వెన్నుపోటు పొడిచారు. రాజకీయంగా ఉనికితో పాటు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీని మోగసించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

పద్మశ్రీ, భర్త ప్రసాద్‌కు పార్టీలో ప్రాధాన్యం

పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆమె భర్త ఘంటా ప్రసాద్ బుధవారం నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో మొదటి నుంచి ఘంటా ప్రసాద్ కీలకంగా ఉన్నారు. పార్టీ కూడా అదే స్థాయిలో ప్రాధాన్యతనిచ్చి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా చేశారు. 2021లో దెందులూరు నియోజకవర్గం పెదపాడు జెడ్పీటీసీగా ఘంటా ప్రసాద్ భార్యకు అవకాశం కల్పించారు. అనంతరం జెడ్పీ చైర్మన్‌గా ఉన్న కవురు శ్రీనివాస్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో జెడ్పీ చైర్మన్ పదవీ ఖాళీ అయింది. అనేక మంది పదవి కోసం ప్రయత్నాలు చేసినా.. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళకు పదవి ఇవ్వాలనే కారణంతో పద్మశ్రీకి గతేడాది జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారు.

మొదట జనసేన.. ఇప్పుడు టీడీపీ

2026 ఏప్రిల్ వరకు ఆమెకు పదవీ కాలం ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలు కావడంతో పదవి కాపాడుకోవడానికి కూటమి వైపు చూశారు. తొలుత జనసేన అని ప్రకటించి చివరికి టీడీపీలో చేరారు. 2013 ఎన్నికల్లో ఘంటా ప్రసాద్ తండ్రి ఘంటా రంగారావు పెదపాడు మండలం సత్యవోలు నుంచి సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అలాంటి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన మహిళకు జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రాధాన్యం ఇచ్చినా వంచనకు పాల్పడి పార్టీకి ద్రోహం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అది కూడా జెడ్పీటీసీల నుంచే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. తనతో పాటు 15 మంది జెడ్పీటీసీలను తీసుకువెళ్లడానికి అన్ని రకాలుగా ప్రయత్నించినా, జెడ్పీటీసీలు ససేమిరా అనడంతో ఒంటరిగా టీడీపీలో చేరారు.

ఘంటా రాకను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలు

ఘంటా ప్రసాద్ ఈ నెల 2న పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అదే రోజు సాయంత్రం జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మళ్లీ మూడురోజులు తరువాత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను విశాఖలో కలిసి ఆగమేఘాల మీద ఘంటా ప్రసాద్ టీడీపీ కండువా వేయించుకున్నారు. మళ్లీ బుధవారం అమరావతిలో లోకేష్‌ను కలిసి జెడ్పీ చైర్‌పర్సన్, ఆమె భర్త టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మినహా ఏలూరు జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు ఎవరూ పాల్గొనలేదు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జెడ్పీ చైర్‌పర్సన్ చేరికను బలంగా వ్యతిరేకించారు.

● మర్యాదపూర్వక భేటీ


వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, మాజీ చీఫ్ విప్, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, పాలకొల్లు సమన్వయకర్త గుడాల గోపి, ఉండి సమన్వయకర్త పీవీఎల్ నర్సింహరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

– సాక్షి, అమరావతి

నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకోవచ్చు

కలెక్టర్ నాగరాణి



భీమవరం : ఖరీఫ్ ధాన్యం అమ్మకాల్లో రైతులకు నచ్చిన రైస్ మిల్లును ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం కలెక్టరేట్‌లో నాగరాణి అధ్యక్షతన ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల సన్నద్ధతపై కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ పంటను కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదని, రైతు సహాయక కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా కూడా పనిచేస్తాయన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా గాకుండా నేరుగా బహిరంగ మార్కెట్లో ధాన్యం అమ్మకానికి రైతుల వివరాలను రైతు సేవా కేంద్రంలో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి. శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పశ్చిమగోదావరి అధ్యక్షుడిగా ప్రసాదరాజు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నర్సాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరు ప్రసాదరాజును నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా ముఖ్యనేతలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులు, ప్రధాన సమస్యలపై మాట్లాడారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడిగా ప్రసాదరాజును ఎంపికచేశారు. ప్రసాదరాజు 2004లో ఎన్నికల రాజకీయాల్లో ప్రవేశించి 2009లో నర్సాపురం నుంచి గెలుపొందారు. 2012లో రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మళ్ళీ 2019లో నర్సాపురం నుంచి గెలుపొంది చీఫ్ విప్‌గా సేవలందించారు. ఈ క్రమంలో సీనియర్ నేత కావడం, అన్ని నియోజకవర్గాల్లో విస్తృత స్థాయి సంబంధాలు ఉండటంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. బుధవారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, మాజీ ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాదరాజు, ఉండి, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జులు పీవీఎల్ నర్సింహరాజు, గుడాల గోపి పాల్గొన్నారు.

మేకా శేషుబాబుపై సస్పెన్షన్ వేటు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబును వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం సస్పెండ్ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ క్రమశిక్షణ, ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



భీమవరం : భీమవరం పట్టణం చక్కావారి వీధిలో గుర్తుతెలియని వ్యక్తి మరణించినట్లు టూటౌన్ ఎస్సై రెహమాన్ బుధవారం చెప్పారు. ఈ నెల 17న గుర్తుతెలియని వ్యక్తికి ఫిట్స్ రావడంతో పడిపోయాడు. వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. 37వ వార్డు రెవెన్యూ సెక్రటరీ ఎ.చైతన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆక్రమణల తొలగింపులో నిబంధనలు పాటించాలి


పెద అమిరంలో ఆక్రమణలు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆక్రమణల తొలగింపులో నిబంధనలు తప్పక పాటించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం స్థానిక పెద అమిరం పుంత రోడ్డులో కాలువ పోరంబోకు మురుగు డ్రెయిన్‌కు ఆనుకుని ఉన్న ఆక్రమణ తొలగింపును జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. మూడు ఎకరాలు 40 సెంట్ల భూమిలో సుమారు రెండు ఎకరాల మేర శాశ్వత కట్టడాలు నిర్మించారు.ఆక్రమణలు కారణంగా డ్రెయిన్ సాఫీగా సాగక పంట పొలాలు, నివాస ప్రాంతాలకు మునిగిపోతున్నాయి.

అఘాయిత్యాలపై కఠిన చర్యలు

- డీజీపీ ద్వారకా తిరుమలరావు
- ఏలూరు రేంజ్ ఎస్పీలతో క్రైమ్ రివ్యూ


ఏలూరు రేంజ్ ఎస్పీలతో నేర సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ ద్వారకాతిరుమలరావు

ఏలూరు టౌన్ : రాష్ట్రంలో చిన్నారులు, బాలికలు, మహిళలపై లైంగికదాడులు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎవరినీ ఉపేక్షించేదిలేదని డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమల రావు హెచ్చరించారు. ఏలూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో ఆయన బుధవారం క్రైమ్ రివ్యూ నిర్వహించారు. తొలుత ఆయనకు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లా పోలీస్ సిబ్బంది ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన ఎస్పీలతో నేర సమీక్ష చేశారు. సుమారు రెండు గంటల పాటు ఏలూరు రేంజ్ పరిధిలో నేరాల పరిస్థితి, కేసుల నమోదు, దర్యాప్తు, నిందితుల అరెస్టులు, కోర్టులో చార్జిషీట్ దాఖలు వంటి అంశాలతో పాటు నేర పరిశోధనపైనా డీజీపీ ఆరా తీశారు. ప్రతి అంశంపైనా క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్, పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహారావు, కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు నేర సమీక్షకు హాజరయ్యారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

డీజీపీ ఏలూరు పర్యటన నేపథ్యంలో డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐజీ కార్యాలయం వద్ద పోలీస్ అధికారులు మోహరించారు. సీఐలు జీ.సత్యనారాయణ, వైవీ రమణ, కోటేశ్వరరావుతో పాటు మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, భీమడోలు సీఐ యూజే విల్సన్, సుభాష్, ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, ఆదిప్రసాద్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావుతోపాటు జిల్లాలోని పోలీస్ అధికారులు డీజీపీ కార్యక్రమంలో ఉన్నారు. ఈ సందర్భంగా నూజివీడు పరిధిలో అఘాయిత్యానికి గురైన బాలిక తల్లిదండ్రులకు డీజీపీ చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందజేశారు.

పదోన్నతులు కల్పించండి: 95 బ్యాచ్ సీఐలు

ఏలూరు పర్యటనలో డీజీపీ ద్వారకాతిరుమల రావును 1995 బ్యాచ్ సీఐలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు సీఐలు డీజీపీకి తమ సమస్య చెప్పుకున్నారు. 1995 బ్యాచ్‌కు చెందిన తమకు పదోన్నతుల్లో తీవ్ర జాప్యం జరిగిందని తెలిపారు. తమకంటే జూనియర్లుగా ఉన్న కర్నూలు, కడప రేంజ్‌లోని సీఐలకు పదోన్నతులు లభించాయని తెలిపారు. తమకు ప్రస్తుతం డీఎస్పీ ప్యానెల్‌లో అవకాశం లేదని 1991 బ్యాచ్‌కు అమలు చేసిన సూపర్ న్యూమరరీ విధానంలో పదోన్నతులు కల్పించాలని వినతి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీజీపీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమస్యలపై వినతిపత్రం

ఏలూరు జిల్లా, రాష్ట్ర పోలీస్ అధికారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు డీజీపీ ద్వారకాతిరుమల రావుకు వినతి చేశారు. బుధవారం డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు కోరారు.

● కొల్లేరులో బతుకు పోరు


ఇటీవల కురుస్తున్న వర్షాలకు.. ఇటు తమ్మిలేరు... అటు బుడమేరు నీరు కొల్లేరుకు చేరింది. కొల్లేరు మొత్తం కళకళలాడుతుంది. మత్స్యకారులు చేపల వేటలో బిజీగా మారారు. తాటి దోనె, ఫైబర్ బోట్లతో చేపల వేటలో బిజీ అయ్యారు. కైకలూరు వెళ్లే ప్రాంతంలో నీటితో కళకళలాడుతున్న కొల్లేరు చిత్రం ఇది.

–సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

జిల్లా జూడో జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: బుధవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17 బాలబాలికల జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలు నిర్వహించామని ఏలూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.అలివేలుమంగ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అండర్ 14 బాలుర విభాగంలో ఏ చంద్రశేఖర్, డి.అజిత్‌కుమార్, జి.ఆదిత్యవర్ధన్, కె.కుశాల్, బి.చరణ్, సీహెచ్ పవన్‌కుమార్, ఎం.శివనాగు, బాలికల విభాగంలో టి.జోత్స్న, జె.హన్సిక, టి.హాసిని, ఎం.గోపిక, పి.హారిక, ఎస్.రుతమ్మ, యు.హేమశ్రీ ఎంపికయ్యారని వెల్లడించారు. అండర్ 17 బాలుర విభాగంలో కె.బాలశివకృష్ణ, సీహెచ్.అజయ్, పి.జగన్నాథ్, కె.హరిచరణ్‌చౌదరి, ఎస్‌కె అబ్దుల్ అజీజ్, కె.రాహుల్, బి.బాలకిరణ్, బి.నవీన్, సీహెచ్ రాజు, బాలికల విభాగంలో పి.దుర్గా లీలావతి, జి.సరిత, ఎం.అనూష, పి.శర్వాణి, డి.పావని తదితరులు ఉన్నారని పేర్కొన్నారు.

తల్లికి వందనం ఎప్పుడిస్తారు



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలుంటే అందరికీ ప్రతి ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ అతీగతీ లేదు. ఇచ్చిన హామీ ప్రకారం కుటుంబంలోని పిల్లలందరికీ తల్లికి వందనం తక్షణమే వేయాలి.

- షేక్ ఫహీమా, తణుకు

భృతి ఇవ్వాల్సిందే..



ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలి. గతంలో చంద్రబాబు హయాంలో నిరుద్యోగ భృతి రూ.2 వేలు ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పారు. ఎన్నికల హామీలో భాగంగా నేడు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. చదువుకున్న మాకు ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

- ఎ.త్రినాథ్, నిరుద్యోగి, తాడేపల్లిగూడెం

గత ప్రభుత్వంలో ఠంచన్‌గా



గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం ప్రారంభించగానే అమ్మ ఒడి పథకం తాలూకా రూ.15 వేలు తల్లి బ్యాంక్ ఖాతాలో ఠంచనుగా జమయ్యేవి. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు పూర్తయినా ఇంత వరకూ తల్లికి వందనం పథకం డబ్బు జమ చేయలేదు.

- పొట్ల సురేష్, తణుకు

ప్రతి నెలా రూ.1500 ఇవ్వాలి



ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ప్రకటించిన విధంగా అర్హులైన మహిళలకు ప్రతీ నెలా రూ.1500 ఇవ్వాలి. అధికారం కోసం కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలి.

- పొన్నమళ్ల విజయ, అత్తిలి

నేటికీ అందని పెట్టుబడి సాయం



ప్రతీ ఏటా మేలో రైతుకు పెట్టుబడి సాయం అందేది. కొత్త ప్రభుత్వంలో రెండు నెలలు గడుస్తున్నా ఈ ఏడాది పెట్టుబడి సాయం అందలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు నాట్లు దెబ్బ తిన్నాయి. మరోసారి రైతులు పెట్టుబడి పెట్టే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తే బాగుంటుంది.


- బాసంశెట్టి సుబ్బారావు, జగన్నాథపురం

మాటిస్తే అమలు చేసేది జగనే



ఇచ్చిన మాట అమలు చేయడంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన రెడ్డి దేశానికే ఆదర్శ ముఖ్యమంత్రి ప్రతీ సంవత్సరం జూన్ లోనే అమ్మ ఒడి పథకం నగదును తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేవారు. ఇప్పుడు హామీల సూపర్ సిక్స్ చూసుకుంటే భయమేస్తుందని చంద్రబాబునాయుడు చెప్పడం శోచనీయం.

- బోణం విజయనిర్మల, తాడేపల్లిగూడెం




సూపర్ చీట్స్

సూపర్ సిక్స్ కాస్త సూపర్ చీట్స్ అన్న చందంగా కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితి మోసం చేయడంలో బాబు మార్కు మరోసారి చూపించాడని పలువురు అభిప్రాయపడుతున్నారు. సంక్షేమ పథకాలను, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు కళ్లకు గంతలు కట్టి, చేతిలో చిల్లిముంత పెట్టాడని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు. తల్లికి వందనంపై అప్పుడే మీన మేషాలు ప్రారంభమయ్యాయి. రైతు బతుకులకు భరోసా లేదు. గృహిణులకు గ్యాస్ బండలు ఉచితంగా ఇవ్వకుండా తుస్‌మనిపించారు. ఉచిత బస్సు ఊసే లేదు. నిరుద్యోగ భృతి మిథ్యగా కనపడుతోంది. ప్రతీ మహిళకు నెలకు రూ.1500 ప్రస్తావనే లేదు. సూపర్ సిక్స్ అంటేనే భయమేస్తుంది అనే స్థాయికి సీఎం చంద్రబాబు వచ్చారు. అసెంబ్లీలో ఈ విషయాన్ని ఆయనే నేరుగా ప్రస్తావించారు. ప్రజలు అర్థం చేసుకోవాలని కూడా కోరారు. ప్రజలు సూపర్ సిక్స్ సూపర్ చీట్స్‌లా ఉందని విమర్శలు చేస్తున్నారు. – తాడేపల్లిగూడెం/తణుకు

సూపర్ సిక్స్

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం ॥ వరకు)
- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



ప్రతి మహిళకు నెలకు రూ.1500

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అర్హులైన మహిళల సంఖ్య -47043
వీరికి నెలకు ఇవ్వాల్సిన సహాయం రూ. కోట్లు
తణుకు నియోజకవర్గంలో అర్హులైన మహిళల సంఖ్య - 1,02,296
వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం రూ. 15.34 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (కోట్లలో)
రైతుభరోసా	తాడేపల్లిగూడెం	రూ.55.51 కోట్లు
రైతు భరోసా	తణుకు	రూ. కోట్లు



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

అన్నదాత సుఖీభవ	తాడేపల్లిగూడెం	లబ్ధిదారులు 60506
అన్నదాత సుఖీభవ	తణుకు	లబ్ధిదారులు 40,242

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (కోట్లలో)
అమ్మ ఒడి	తాడేపల్లిగూడెం	రూ.49.78 కోట్లు
అమ్మ ఒడి	తణుకు	రూ.34.34 కోట్లు



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధిదారులు
తల్లికి వందనం	తాడేపల్లిగూడెం	72,238
	తణుకు	25,743

వైఎస్సార్‌సీపీ హయాంలో పక్కాగా అమలు

గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పక్కాగా అమలు చేసింది. చిన్నారులందరినీ బడి బాట పట్టించాలనే ఉద్దేశ్యంతో అమ్మ ఒడి పేరుతో రూ.15 వేలు నగదు తల్లి బ్యాంకు ఖాతాల్లో జమ చేసి పిల్లలను పాఠశాలలకు పంపేలా చేశారు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. దీంతో బడిబయట పిల్లలు బడిబాట పట్టడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెరిగింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ పథకానికి తల్లికి వందనం అని పేరుమార్చడమే కాకుండా ఆ పథకాన్ని అమలు పరచకుండా ప్రతీ తల్లిని వంచనకు గురి చేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు బహిరంగ సభల్లోను, మైకులలోను సూర్యోదయం కాకుండానే మొదలుపెట్టి రాత్రి పడుకునే వరకు అదే పనిగా ఊదరగొట్టేశారు. సూపర్‌సిక్స్ పేరుతో ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకంలో రూ.15వేలు చొప్పున ఇస్తామంటూ భారీగా ప్రచారం చేశారు. కూటమి నేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లు బహిరంగా సభల్లోను ఎన్నికల ప్రచారాల్లోను చెప్పినట్లుగా సూపర్ సిక్స్ పథకాలన్నీ తప్పనిసరిగా అమలు చేయాల్సిందే నంటూ ప్రజానీకం డిమాండ్ చేస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో అమ్మ ఒడి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు
2020	22420	రూ. 33.63కోట్లు
2021	14862	రూ. 22.29కోట్లు
2022	22898	రూ. 34.34కోట్లు
2023	21610	రూ. 28.18కోట్లు



యువతకు నెలకు 3 వేల రూపాయల నిరుద్యోగ భృతి

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అర్హులైన యువత : 73646
వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం రూ.22.09 కోట్లు
తణుకు నియోజకవర్గంలో అర్హులైన నిరుద్యోగ యువత :
వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం రూ. కోట్లు

క్లుప్తంగా

భద్రాచలం ఆర్టీసీ బస్సు రూటు మార్పు..

తణుకు అర్బన్: తణుకు పరిసర ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం తణుకు నుంచి భద్రాచలానికి నడుపుతున్న అల్ట్రా డీలక్స్ బస్సు రూటులో మార్పులు చేసినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు తణుకులో బయలుదేరి తాడేపల్లిగూడెం, నారాయణపురం, భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, అశ్వారావుపేట, వినయకపురం, నందిపాడు, కుక్కునూరు, చిరవల్లి, ఉప్పేరు, అమరవరం, బూరుగుంపాడు మీదుగా మధ్యాహ్నం 11.45 గంటలకు భద్రాచలం చేరుతుందని, తిరిగి మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి రాత్రి 7.15 గంటలకు తణుకు చేరుతుందని చెప్పారు. రిజర్వేషన్ కోసం 94404 19144 నంబరులో సంప్రదించాలని కోరారు.

గెస్ట్ అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

తణుకు: చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ఒకేషనల్ కోర్సు సివిల్ ఇంజినీరింగ టెక్నీషియన్ విభాగంలో బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్‌గా పని చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రభాకరరావు తెలిపారు. బీటెక్ సివిల్‌లో యాభైశాతం మార్కులు కలిగి ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూలు ఈనెల 23న జరుగుతాయని పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

యంత్రసాయం అవసరం

తాడేపల్లిగూడెం: కొబ్బరి ఉత్పత్తుల తయారీలో యంత్రసాయం అవసరమని వెంకట్రామన్నగూడెంలోని కెవికెలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు తెలిపారు. బుధవారం రెండో రోజు శిక్షణలో భాగంగా కొబ్బరి ఉత్పత్తుల తయారీ కొబ్బరి చిప్స్, కొబ్బరి పొడి తయారీలో ఎలాంటి యంత్ర పరికరాలు వివరించాలో తెలియజేశారు. కొబ్బరి రైతుల ఉత్పత్తి దారుల సంఘాలు ఏర్పాటు చేసుకోవడం, వ్యాపార సరళిలో కొబ్బరి ఉత్పత్తులను తయారు చేయడంలో సాంకేతికత, యంత్రాల ఆవశ్యకత గురించి వివరించారు. కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి కెవికె సమన్వయకర్త ఇ.కరుణశ్రీ, వి.సుజాత, తదితరులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, నాబార్డు, ఇతర ఆర్థిక సంస్థలు అందిస్తున్న సహకారంతో ఆదాయాన్ని పెంచుకొనే దిశగా అందరూ ముందుకెళ్లాలని కోరారు.

పోషకాహారంతో ఆరోగ్యం

అత్తిలి: గర్భిణులు, బాలింతలు రోజువారీ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేటట్లు చూసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి ప్రమోద కుమారి చెప్పారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా బుధవారం అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ ప్రమోదకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే బాలసంజీవని కిట్లు బాలామృతం, గుడ్లు, పాలు వంటి పోషకాహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో జోగి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరుపతిపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ దృశ్యం

కంచుమర్రులో గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాహార పదార్థాలను తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం మహాలక్ష్మి అన్నారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం కంచుమర్రు గ్రామంలో అవగాహన సదస్సు జరిగింది. తక్కువ ఖర్చుతో లభించే పోషకాహార పదార్థాల తయారీపై ఆమె వివరించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్‌హెచ్‌ఎం విజయ్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పి సువర్ణబాయమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల టాయిలెట్ల శుభ్రతపై విచారణకు త్రిసభ్య కమిటీ

తణుకు అర్బన్: నాడు ఇంపు.. నేడు కంపు అని సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు దుర్గంధంగా మారాయని కనీసం యాసిడ్స్, శుభ్రపరిచే పరికరాలు కూడా అందుబాటులో లేవంటూ వచ్చిన కథనానికి ఆర్‌జేడీ జి.నాగమణి స్పందించి ఒక డీవైఈవో, ఎంఈవోలతో త్రిసభ్య కమిటీ వేశారు. కమిటీ సభ్యులైన డీవైఈవో డి.మురళీ సత్యనారాయణ, ఎంఈవోలు ఎస్.శ్రీనివాసరావు, హైమావతి తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో పర్యవేక్షించి అవసరమైన యాసిడ్స్ తెప్పించి టాయిలెట్స్‌ను సిబ్బందిచే శుభ్రం చేయించడమే కాకుండా తరగతి గదుల వద్ద పేరుకున్న చెత్త, వ్యర్థాలను తొలగింప చేయించారు. దీంతోపాటు కొన్ని నెలలుగా పాఠశాలలో ఆయాలు, వాచ్‌మెన్‌లకు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలకు సంబంధించి బిల్లు సైతం చేయించినట్లుగా అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అవసరమైన వసతులన్నీ కల్పించాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు.

సాక్షి స్పందన



సిబ్బందితో టాయిలెట్స్ శుభ్రం చేయిస్తున్న దృశ్యం

ఉచితంగా బస్‌పాస్‌ల పంపిణీ

అత్తిలి: దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తణుకు డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. బుధవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన గారపాటి రాజగోపాలరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు గారపాటి శివకృష్ణ అశోక్ ఆర్థిక సహకారంతో తణుకు ఆర్టీసీ డిపో వారు 170 మంది విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరిసర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థినిల రవాణా సౌకర్యార్థం ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దాత అశోక్‌ను డిపో మేనేజర్, హెచ్‌ఎంలు అభినందించారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగి ములగాల వెంకటరత్నం, స్థానిక నాయకులు గారపాటి ధర్మయ్య, ముత్యాల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ ప్రగడ శ్రీనివాస్, ఆకుల రామచంద్రరావు, దాసం ఆదియ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిలకు ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేస్తున్న తణుకు డిపోమేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్

కారుమూరి పరామర్శలు

ఇరగవరం: మండలంలోని ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఇరగవరం మాజీ సర్పంచ్, బొక్కా భాస్కర్ రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. వారి కుటుంబాన్ని, దొమ్మేటి జయలక్ష్మి, యేలేటిపా డులో సూర్యభాస్కర్‌రెడ్డి కుటుంబాలను మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, వీరవల్లి యుగాంధర్, వీరవల్లి వీగ్నేష్, వీరవల్లి త్రిమూర్తులు, దినేష్ రెడ్డి, చోడే జోషి, ఏసురత్నం, కడలి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇరగవరంలో బొక్క భాస్కర్ రావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కారుమూరి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో వెక్టార్ కంట్రోల్, హైజీన్, డ్రై డే ఫ్రైడే కార్యక్రమాల అమలును పరిశీలించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు పుట్టకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆరుగొలను సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్, సుగుణరాజు, వార్డు ఆరోగ్య కార్యకర్తలు విజయశాంతి, మేరీ, వెంకటలక్ష్మి, ఆశాలు విజయలక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రాజు పాల్గొన్నారు.

జగనన్నకు కలిసిన పార్టీ నాయకులు

పెంటపాడు: మండలం, గూడెం పట్టణానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన నివాసం వద్ద కలిసారు. మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో జగనన్నను తామంతా కలిసినట్లు వైఎస్సార్ సీపీ శ్రేణులు వివరించారు. పార్టీ అభివృద్ధికి పాటు పడాలని ఆయన సూచించారన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, గూడెం మాజీ ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుండుమోగుల సాంబయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌లు కర్రి భాస్కరరావు, బొడ్డు సాయిబాబా, కొలుకులూరి ధర్మరాజు, జనార్ధన్, బోణం విజయనిర్మల, బోణం వీరయ్య, పార్టీ నాయకులు బండారు నాగు, పెంటపాడు గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, బండారు రాంబాబు, బొద్దాని శ్రీనివాస్, గోకా వెంకటేశ్వరరావు తదతరులు జగనన్నను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు శ్రీవాసవిలో జాబ్ మేళా

తాడేపల్లిగూడెం (టీఓసీ): వికాస, శ్రీ వాసవి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పట్టణంలో ఈ నెల 19వ తేదీ గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణ తెలిపారు. ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలిసేల్స్ రిప్రెజెంటేటివ్, రిప్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నిషియన్, కెమిస్ట అండ్ హెల్పర్, ఇండో ఎం.ఐ.ఎం, ఇంజి, డీఎస్‌సీ, అండ్ హోం డాయ్‌మోబీస్ కంపెనీలలో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీఎస్సీ, బి.టెక్, బయోటెక్నాలజీ, మైక్రో బయోలజీ, ఉత్తీర్ణత సాధించిన 30 సంవత్సరాల లోపు స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని చెప్పారు. నెలకు రూ 12 వేలు నుంచి 18 వేలు వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా ఖర్చులు ఉద్యోగాన్ని బట్టి ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 19వ తేదీ గురువారం పట్టణంలోని శ్రీ వాసవి డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 7799376111 సంప్రదించాలని కోరారు.

తీగజాతిలో సమగ్ర సస్యరక్షణ

తాడేపల్లిగూడెం: కూరగాయలలో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి వెంకట్రామన్నగూడెంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త ఎస్.చిరంజీవి లోదుక్కులు, విత్తన శుద్ధి, లింగాకర్షక బుట్టల వాడకం,జిగురు అట్టల వాడకం, పక్షి స్థావరాలను ఉంచడం తదితర పద్ధతుల గురించి వివరించారు. అధిక వర్షాలు పడిన తర్వాత రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి, వెంకట్రామన్నగూడెం, తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఈ కేవైసీ ప్రక్రియ

అత్తిలి: సార్వా ఈ పంట నమోదుకు సంబంధించి ఈ కేవైసీ ప్రక్రియ గురువారంతో ముగుస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. ఈ కేవైసీ చేయించుకోని రైతులు వెంటనే సమీప రైతు భరోసా కేంద్ర ఇన్‌ఛార్జ్ వద్ద ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ క్రాప్‌లో ఈ కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ధాన్యం అమ్మడం, పంటనష్ట పరిహారం, సున్నా వడ్డీ, క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తాయని ఏఓ రాజేష్ తెలిపారు.